# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పోలవరం ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.
- ❖ లోకాయుక్త స్ఫూర్తిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.
- ❖ పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.
- ❖ దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరిందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

======================

పోలవరం ప్రాజెక్టులో పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేసేందుకు ఎన్డిఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ పనుల పురోగతి, ఎత్తు తగ్గింపుపై శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 5 రోజులకే ముఖ్యమంత్రి పోలవరం సందర్శించారని, దీనిని బట్టి ప్రాజెక్టుకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నామో గమనించాలని అన్నారు. 2014 - 19 సంవత్సరాల మధ్య టీడీపీ పాలనలో 11 వేల 762 కోట్ల రూపాయలు ఖర్చుతో 72 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, అలాగే... పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణాలకు 4 వేల 144 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని వివరించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి స్థాయిలో 45.72 మీటర్ల ఎత్తులో నీటిని నిల్వ చేసేలా నిర్మిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

======================

దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడ కృష్ణలంకలో జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఒక కోటీ 55 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, దీపం-2 పథకం

విజయవంతంగా అమలవుతోందని అన్నారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందవచ్చని పేర్కొన్నారు. మరింత మెరుగైన సేవలందించే లక్ష్యంతో స్థానిక గ్యాస్ కంపెనీలు, ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని మంత్రి తెలియజేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

=====================

లోకాయుక్త స్ఫూర్తిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మండలిలో ఈరోజు లోకాయుక్త సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2024 ఎన్నికల తర్వాత కొత్త పరిస్థితులు ఏర్పడ్డాయని, శాసనసభలో ప్రతిపక్ష నేత లేకపోవడంతో లోకాయుక్త మెంబర్స్ సెలెక్షన్ కమిటీ కాంపోజిషన్స్ గురించి ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త అమెండ్ మెంట్ బిల్లు ప్రవేశపెట్టడం జరిగిందని చెప్పారు. శాసనసభలో ప్రతిపక్ష నేత లేకపోవడంతో మిగిలిన నలుగురు సభ్యులతో లోకాయుక్త కమిటీ ఉంటుందన్నారు. సాధారణంగా లోకాయుక్తకు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ కాని, హైకోర్టు రిటైర్డ్ జడ్జి గాని ఛైర్మన్ గా ఉంటారని, ఉప లోకాయుక్తగా డిస్ట్రిక్ట్ రిటైర్డ్ జడ్జి ఛైర్మన్ గా ఉంటారని చెప్పారు. దీని కోసమే ఈ బిల్లును ప్రవేశపెట్టడం జరిగిందని మంత్రి తెలియజేశారు.

విరామం

=====================

విశాఖ మెట్రోరైలు ప్రాజెక్టు సంబంధించి నూరు శాతం వ్యయాన్ని భరించాల్సిందిగా కేంద్రాన్ని కోరామని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ తెలిపారు. ఈరోజు శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ... ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర రవాణా ప్రణాళికను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని, కేంద్రం నుండి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మొదటి ఫేజ్ లో 46.2 కిలోమీటర్ల నిడివితో 3 కారిడార్ల నిర్మాణం జరుగుతుందన్నారు. మొదటి ఫేజ్ కారిడార్లలోని ప్రాంతాల్లో 8 మీటర్ల ఫ్లై ఓవర్, దానిపైన మెట్రో నిర్మాణం చేయమని స్థానిక శాసన సభ్యులు విజ్ఞప్తి చేశారని, ఆ మేరకు డీపీఆర్ చేయాలని నిర్ణయించామని మంత్రి వివరించారు.

=====================

పర్యాటక రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శాసనసభలో ఈరోజు ఆయన నూతన టూరిజం పాలసీని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పర్యాటక రంగ అభివృద్ధితో పాటు స్థానిక జన సమూహాలను బలోపేతం చేయాలన్న విజన్ తో పాలసీని రూపొందించామన్నారు. పర్యాటక రంగానికి ముఖ్యమంత్రి పరిశ్రమ హోదా కల్పించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రంగం ద్వారా ఆర్థిక పురోభివృద్ధి, ఉపాధి కల్పన, సాంస్కృతిక మార్పిడిని పెంపొందించడమే లక్ష్యమని చెప్పారు. పర్యాటక రంగం ద్వారా రాష్ట్రంలో 20 శాతానికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. విదేశీ పర్యాటకులు అత్యధికంగా వచ్చే మొదటి 10 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ను ఒకటిగా నిలిపే దిశగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

=====================

జిల్లా స్థాయి యువ ఉత్సవాల్లో పాల్గొని యువత ప్రతిభను నిరూపించుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి సుంకర రాము పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ వుమెన్ కళాశాలలో యువ ఉత్సవ్ 2024 రేపు జరుగుతుందన్నారు. “పంచ ప్రాణ్ అమృత్ కాల్ గోల్ ఆఫ్ డెవలప్డ్ ఇండియా ఎట్ 2047” అనే ఇతివృత్తంతో ఈ యువ ఉత్సవ్ జరుగుతుందని, పెయింటింగ్, కవిత్వం, మొబైల్, ఫొటోగ్రఫీ తదితర విభాగాల్లో వ్యక్తిగత,

గ్రూప్ పోటీలు ఉంటాయన్నారు. విజేతలు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, దేశ స్థాయికి పంపబడతారని, మరిన్ని వివరాలకు 9966357021 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

(వాయిస్ 50 సెకన్లు)

=====================

భారత క్రీడారంగంలో దేశం గర్వించదగ్గ క్రీడాకారులు ఉన్నారని...వాళ్ళని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర క్రీడా శాఖ సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సే అన్నారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆలయాన్ని ఆమె ఈరోజు సందర్శించి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోడీ క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. 2036 నాటికి ఒలంపిక్స్ భారత్‌లో నిర్వహించే విధంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాకారులకు ప్రోత్సాహకంగా రాష్ట్రంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తామని కేంద్ర సహాయ మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

=====================

కాపు సామాజికవర్గ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.సవిత అన్నారు. ఈడబ్ల్యూఎస్ బడ్జెట్ కేటాయింపులపై శాసన మండలిలో ఈరోజు జరిగిన చర్చ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ను 2015లో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేశారని, 2014 - 19 సంవత్సరంలో కాపు కార్పొరేషన్ కు 3 వేల 82 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. కాపుల అభివృద్ధి కోసం.. చంద్రన్న స్వయం ఉపాధి, ఎన్టీఆర్ భరోసా, చంద్రన్న విదేశీ విద్యాపథకం, కాపు భవనాలు, రుణమాఫీ మొదలైనవి అమలు చేశామన్నారు.

=====================
=====================